# ఇల్లు మారవద్దు

"ఈమారు మళ్ళీ ఇల్లు మారాలండీ అంటూ దీర్ఘాలు తీశావంటే ఊరుకోను" అన్నాడు రామనాథం.

"అలా ఎందుకంటానండీ! అయినా నేనే కదాండీ ఈ ఇంటికి అన్ని సౌకర్యాలూ ఉన్నాయని చెప్పి మిమ్మల్ని ఒప్పించింది!" అంది కాత్యాయని వంటింటి అలమారులో సీసాలూ డబ్బాలూ సర్దుకుంటూ.

ఏమోలే! ఇది కూడా మారామంటే, మా ఆఫీసులో, తోటి గుమాస్తాల్ని పట్ట పగ్గాలుండవు. ఇప్పటికే వాళ్ళు నవ్వుతూ అంటున్నారు - ఏరా రామనాథం పిల్లి పిల్లల్ని పెట్టి ఏడిళ్ళు తిప్పినట్టు ఎవిటి నెలనెలా ఈ యిల్లు మారడం అని...."

"ఏడిశారు మన గొడవ వాళ్ళకెందుకు?" అని గయ్ మంటూ లేచింది కాత్యాయని.

ఇంతలో వాళ్ళ తొమ్మిదేళ్ళ అమ్మాయి సీత పెద్ద పుస్తకాల దొంతర గుండెలకి ఆన్చి వంటింట్లోకి పట్టుకువచ్చి "అమ్మా నాస్కూలు పుస్తకాలు ఈ చిన్న గూట్లో పెట్టుకుంటానే!" అంది.

"ఆహా! చదువుకునే పుస్తకాలు వంటింటి గూట్లో పెట్టుకోవాలని నీకు తోచినందుకు చెప్పాలే నా తల్లీ! వెళ్ళి, హాల్లో అలమార్లో పెట్టుకో" అంది కాత్యాయని విసుగ్గా.

"బాబిగాడు అంతకిత్రమే వాడి పుస్తకాలు పెట్టుకున్నాడే!" ఫిర్యాదు చేసింది సీత.

"పెట్టుకుంటే యేం? ఆ పక్కని నీవికూడా సర్దుకో-వెళ్ళు" కాత్యాయని కూతుర్ని కసురుకుంది. సీత వెళ్ళిపోయింది. భార్య కంఠంలో ధ్వనించిన తీవ్రత విని రామనాథం కూడా చల్లగా అక్కడినుంచి తప్పుకున్నాడు. డ్రాయింగ్ రూమ్‌లో తన ఫైల్సూ సరంజామా ఒక పద్ధతిలో సర్దుకోవడం కోసం.

పది నిముషాలయేటప్పటికి హాల్లోంచి అల్లరి వినిపించింది.

"నీ పుస్తకాలు ఇక్కడ పెట్టకు అంటే వినిపించదంటే!" అంటూ అరిచాడు బాబిగాడు.

"అమ్మ ఈ అలమార్లోనే సర్దుకోమంది." సీత సమాధానం.

"వీల్లేదు" అన్నాడు బాబి.

"ఏం ఎందుకు వీల్లేదు?" సీత మొరాయింపు.

కాస్సేపటికి ఇద్దరూ గట్టిగా కేక లేసు కుంటున్నారు. అదివిని వంటింట్లోంచి కాత్యాయని, డ్రాయింగ్ రూమ్‌లోంచి రామనాథం, ఇద్దరూ చరుగ్గిన అక్కడికి వచ్చారు.

వస్తూనే కాత్యాయని "ఒరేయ్ బాబీ, వేలెడు పెదవ్వు లేవు. దాని పొడంటే గిట్టదేం నీకు?" అంటూ కసురుకుంది.

బాబి చిన్నబుచ్చుకుని బిక్క మొహంవేసి తండ్రికేసి చూశాడు.

దాంతో రామనాథం "అయినా సీతా నువ్వు పెద్దదానివి కదా! వాడితో నీ కేమిటమ్మా! నువ్వెళ్ళి పుస్తకాలు వేరే అలమార్లో పెట్టుకో" అన్నాడు.

"అలాగే నాన్నా" అంటూ తలవంచుకొని వెళ్ళ బోయింది సీత.

"అల్లా వీల్లేదు. ఇక్కడే పెట్టుకో నీ పుస్తకాలుకూడా. అయినా మీరేమిటండీ. వాడిని నాలుగు కూకలెయ్యక దాన్ని మందలిస్తారు?" అంది.

"ఇంతలోకే దానికి అన్యాయం జరగదులే. అది సరేనంటూ ఒప్పుకోనే ఒప్పుకుంది.... నువ్వే దాన్ని రెచ్చ గొడుతున్నావు."

"ఏమైనా వాడి ఆగడం రోజు రోజుకీ పెరిగిపోతోంది. దానికితోడు మీరిచ్చే బలం కొంత. నాకు తెలియకడుగు తాను. మీరెందుకండీ పిల్లల విషయంలో జోక్యం చేసుకోవడం?"

"జోక్యం చేసుకున్నది మొదట నువ్వా నేనా?"

"నువ్వా నేనా అంటూ ప్రారంభమైన ఆ వాదన చిలికి చిలికి గాలివానయి, ఉరుములు మెరుపులలోకి దిగింది. ఇలా తమతో మొదలైన తగాదా, అమ్మా నాన్నా దెబ్బలాట కింద మారడం మామూలే కనక, సీతా బాబీ ఇద్దరూ తమాషా చూస్తూ నిలబడ్డారు. రామనాథం అరుపులూ, కాత్యాయని విదిలింపులూ తారస్థాయికిచేరి, ఆ వీధి వీధి అంతా వినిపిస్తూన్న సమయంలో వాళ్ళిద్దరికీ ఎదురింట్లోంచి కిలకిలమని నవ్వులు వినిపించాయి. ఎదురింటి దంపతులు కాబోలు నవ్వుతున్నారు.

తమని చూసేనా ?

రామనాథం కాత్యాయనీ ఇద్దరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఇద్దరి కళ్ళూ అనుకోకుండా ఎదురింటికేసి చూశాయి. ఎదురింటి తలుపు వేసే ఉంది. వరండాలో కూడా మనుష్యులెవరూ కనిపించలేదు. ఆ నవ్వులు లోపలి నుంచి వచ్చినట్లున్నాయి. అయితే అవి తమనిచూసి నవ్వినవి కాదు! ఆ భార్యా భర్తల్లో ఎవరో ఒకరు జోక్ వేస్తే దానికి

ఇద్దరూ నవ్వుకొని ఉంటారు. అంతే! ఇప్పుడు మళ్ళీ ఆ నవ్వులు వినిపించడం లేదుగా? వాళ్ళ గేటులో జాజి పందిరిలాగే వాళ్ళ ఇంటి వాతావరణం కూడా ప్రశాంతంగానూ నిశ్శబ్దంగానూ ఉంది. పందిరి మీద అక్కడక్కడ ఒక పువ్వు విరిసినట్లు ఉండుండి ఆ ఇంట్లోంచి అలా ప్రశాంతమైన నవ్వులు వినిపిస్తాయి కాబోలు. వాటిలోస్వచ్ఛతే కాని అపహాస్యం ఏం కనిపించలేదు.

అయినా ఏవిటో ఆ నవ్వులు రామనాధాన్నీ కాత్యాయనిని అప్రతిభుల్నే చేశాయి. తమ వాగ్వాదాన్ని అంతటితో ఆపేశారిద్దరూ. డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి రామనాథం ఆఫీసు కాగితాల్ని నంబరువారీగా పేర్చి పిన్‌చేస్తూ ఆలోచించసాగాడు. వంటింట్లోకి వెళ్ళిన కాత్యాయని ఆలోచనలు ఎదురింటి చుట్టూనే తిరుగుతున్నాయి. ఆ ఎదురింట్లో ఎవరున్నారు చెప్మా? అది వాళ్ళ స్వంత ఇల్లో? లేక తమలాగే అద్దెకి వచ్చారో! ఆయనకేం ఉద్యోగమో? ఆవిడ ఎలా వుంటుందో? ఎంతమంది పిల్లలో" ఇలా ఆ రోజల్లా ఆలోచనలతోటే పొద్దుపుచ్చింది, మధ్యమధ్యలో ఇల్లు సర్దుకొంటూ.

మర్నాడు పొద్దుటే మౌనంగా కాఫీ అందిస్తున్న భార్యని చూసేసరికి రామనాధానికి హృదయమంతా మమతతో నిండిపోయింది. "ఇలా మౌనంగా ముద్దరాలుగా ఉంటే ఎంత ముద్దొస్తావో తెలుసా?" అన్నాడు కళ్ళల్లో వలపులు పండిస్తూ.

"గయ్ గయ్‌లాడుతూ ఉండడం నాకు మాత్రం సరదా యేమిటీ? మీరే ఎదో లేని పోని గొడవ తెచ్చి పెడు తుంటారు" అంటూ మూతి తిప్పుకుంది కాత్యాయని.

"నేనా?" అంటూ నవ్వాడు రామనాథం.

"అదిగో మళ్ళీ నేనా అంటూ వాదన ప్రారంభం.... ఇంతకీ ఏదో చెప్పబోయాను...."

"ఏమిటీ?"

"నిన్న పొద్దున్న నవ్వులు వినిపించాయి. వాళ్ళెవరో తెల్సా"

"ఏం వెళ్ళి వాకబుచేసి తెలుసుకొని వచ్చావా?" నీరసంగా కుర్చీకి చేరగిలబడిపోయాడు రామనాథం.

"అంత తెలివి తక్కువ దాన్నేం కాదులెండి. సీతని పంపించి వాకబు చేయించాను."

"ఎందుకా తాపత్రయం నీకు చెప్పు.... బంగారం లాంటి మన టైముని ఆ కబుర్లతో ఎందుకు వృధా చెయ్యడం కాని...."

"అబ్బ....వినండి. వాళ్లది స్వంత ఇల్లేట.... వాళ్ళకి ముగ్గురు పిల్లలట కూడాను...."

"అది సరే.... ఇల్లంతా సర్దుకోవడం పూర్తి అయిందా? ఈ లోకాభి రామాయణం చెప్పకపోతే ఫోటోలు తుడిచి ఇవ్వకూడదూ. గోడకి మేకులుకొట్టి తగిలిస్తాను...."

"ఏపిటో నా మొహం నేను చెప్పింది ఎప్పుడు మీరు విన్నారు కనుక... ?"

"ముఖం అలా విసుగ్గా పెట్టకు.... అందమైన ముఖాన్ని విసుగ్గానూ, వికారంగానూ పెడితే చూడలేం?"

"ఊ....మధ్యలో పొగడ్త వొకటి ... అది సరే.... ముగ్గురిలోనూ ఇద్దరు అమ్మాయిలూ ఒక అబ్బాయీట. ముగ్గురూ పై చదువులికి వెళ్ళారంటే ఆవిడకి ఇప్పుడు నలభై ఏళ్ళుండవ్? అయినా అందంగానే ఉంటుందిట...."

"నీకంటేనా?"

"అదిగో. ఆ వెటకారం మాటలే వద్దన్నాను....మధ్యలో అడ్డు పుల్లలు వెయ్యకుండా చెప్పింది వింటారా వినరా?" కస్సుమంది కాత్యాయని.

"నే వినను. అయినా నాకెందుకీ లోకం గొడవ?" అంటూ విసుక్కున్నాడు రామనాథం....

"నేనెప్పుడు ముచ్చటపడి మాట్లాడినా మీరిలాగే విసుక్కుంటారు లెద్దురూ.... ఈ మారు మీ ఆఫీసు విషయాలు చెప్పండి చెప్తాను" అంటూ లేచింది కాత్యాయని....

ఇంతలో మళ్ళీ ఎదురింటిలోంచి తియ్యని నవ్వులు వినిపించాయి. కాత్యాయని ఆ నవ్వులు విని గతుక్కుమంది. మళ్ళీ అంతలోనే సర్దుకుని "రండి ఫోటోలు అందిస్తాను. గోడకి తగిలిద్దురుగాని...." అంది.

గోడల్ని ఫోటోలు ఓ పక్కనుంచి అందంగా అమరుస్తూ మరో పక్కనుంచి ఆలోచిస్తున్నాడు రామనాథం.

ఆ ఎదురింటాయన భార్యని తియ్యని కబుర్లు చెప్పి అలా నవ్వించాడో, లేక ఆమె ఆయన్ని తన ప్రణయ ప్రభావంతో పరవశింప జేసిందో. ఏమైనా అలా నవ్వులు నట్టింట్లో వినిపించే ఇంట్లో తప్పకుండా దాంపత్య జీవితం ప్రణయ సామ్రాజ్యాన్ని ఏలుతూ ఉంటుంది. ఆ నవ్వులే ఇంటికి ఎయిర్ కండిషన్లు. మనస్సుకి చల్లదనం వెచ్చదనాల్లో ఎప్పుడేది కావలిస్తే అప్పుడది సమకూరుస్తాయి. రామనాథం ఆలోచనలు ఇలా పరిగెడుతూంటే, కాత్యాయని కూడా ఎదురింటివాళ్ళ గురించే తలపోయసాగింది.

"ఆ ఇంటాయన ఆమెని మురిపాల్లో తేలుస్తున్నట్లున్నాడు. ఆమె హృదయాన్ని అర్థంచేసుకొనే రసజ్ఞుడేమో. చెప్పినట్లు వినే మొగుడుంటే తనింట్లోనూ నవ్వులు వినిపించును అంతకంటే తియ్యగా...."

* * *

రెండు మూడు రోజులు గడిచాయి.

ఆ రోజు కూరలు తరగడానికని కత్తిపీట ముందేసుకుని కూర్చుంటూ సీతని పిలిచి "ఏవిటే, ఆవిడేదో నీతో చాలా సేపు కబుర్లు చెపుతోంది?" అని అడిగింది కాత్యాయని.

చదువుకుంటూన్న పుస్తకాన్ని అక్కడ పడేసి వంటింట్లో తల్లి దగ్గిరికి వచ్చి కూచుని సీత చెప్పడం మొదలు పెట్టింది.

"ఇంట్లో పనులన్నీ వాళ్ళే చేసుకుంటారటమ్మా.... మొక్కలకి నీళ్ళుపోయడం వంటసామాను కడుక్కోవడం దగ్గర్నుంచి...."

"అయితే పనిమనిషి లేదన్నమాట!" కాత్యాయని నవ్వింది.

"ఆయన ప్రొద్దున్నే స్కూటర్ మీద పోయేది ఆఫీసుకి కాదట-పొలంట. ఆయన ఉద్యోగం కూడా చెయ్యటం లేదట!"

"మరి పెద్ద ఆఫీసరులా బట్టలేసుకుంటా డేవిటి? చేస్తున్నది వ్యవసాయమా? అయితే చదువుకోలేదన్న మాట. మీ నాన్నగారిలాగ బి. యేలు బి. కాంలు?"

వాళ్ళ కబుర్లు చెవుల్లో పడ్డట్టున్నాయి. డ్రాయింగ్ రూంలోంచి రామనాథం అరిచాడు "ఏవిటా కబుర్లు? దాన్ని చదువుకోనియ్యి" అంటూ

"అలాగేలెండి" అని మొగుడికి గట్టిగా సమాధానం చెప్పి "మెల్లగా చెప్పవే వెఱ్ఱి మొహమా!" అంది కాత్యాయని కూతుర్ని ఉద్దేశించి.

"పిల్లలు ముగ్గురుండడం నిజమేనా! ఏం చేస్తున్నారు?"

"పెద్దమ్మాయి మెడిసన్ ."

"ఆ ... ఏవిటి?"

"మెడిసన్ ... "

"అవతల వెధవ.... బాబిగాడు గట్టిగా అరుస్తూ చదువు తున్నాడు. వినిపించడంలేదు. కొంచెం గట్టిగా చెప్పు.... ఏవిటీ ...... మో?"

"ఎన్నిసార్లు చెప్పాలి? మెడిసన్ అంటే డాక్టరు పరీక్ష అన్నమాట. రెండో అమ్మాయి ఎమ్. ఏ. అబ్బాయి ఇంజనీరింగ్...."

"ఆ అంతా గొప్పలు. ఆదంతా నిజం అయిఉండదు. ఊ ... వెళ్ళిపోకు ... నువ్వు మళ్ళీ స్కూలుకి వెళ్ళిపోతే నాకు సాయంత్రందాకా ఏ కబురూ తెలియదు."

ఆవిడ దగ్గరున్న పుస్తకాలు...."

"ఆ....ఏమిటి? కొంచెం గట్టిగా చెప్పవే."

"నే చెప్పనే-ఎన్నిసార్లు చెప్పినా ఆ.... ఊ.... అను కుంటూను" గట్టిగా అరిచింది సీత.

ఆ అరుపు విని, రాస్తున్న చేతిలో కలంతో గబగబా వంటింట్లోకి వచ్చాడు రామనాథం. వచ్చి "ఏమిటే ఆ గొడవ దాన్ని చదువుకోనివ్వకుండా?" అంటూ కేకవేశాడు. మెల్లగా సీత అక్కడనుంచి జారుకుంది.

"ఆడవాళ్ళ గొడవలు మీకెందుకు? మీరెళ్ళి రాసుకోండి" అంటూ విసుక్కుంది కాత్యాయని.

ఇంతలో బాబీ వచ్చి "నాకు స్కూలుకి టైమయింది అన్నంపెట్టు" అన్నాడు.

"ఇంకా వంట కాలేదురా" అంది కాత్యాయని.

"ఏం చేస్తున్నావు ఇప్పటిదాకా?"

"ఏం చేస్తోందా? ఊరి గొడవలు కనుక్కుంటూ కూచుంది" అన్నాడు రామనాథం వెటకారంగా.

"అందరూ అథార్టీలు చేసేవారే. పని సాయం చేసే వాళ్లు ఒక్కరూలేరు. ఎదురింటాయన ఆవిడకి ఇంట్లో ఎంత పని సాయం చేస్తాడోట" అంది కాత్యాయని కోపం వెళ్ళగక్కుకుంటూ.

"ఇన్ని పనులుండి కూడా నువ్విలా ఊరి విషయాలు కనుక్కుంటున్నావు. నా సాయం ఒకటి వచ్చి నీకున్న ఈ పనికూడా తగ్గిపోతే ఇంక నీ సంగతి అడగాలా? నీలా ఆవిడకి బయటి గొడవలు అక్కర్లేదు కనుక మొగుడి అభిమానాన్ని సంపాదించి ఉంటుంది. నువ్వుకూడా అలా ఉండు చూద్దాం."

"హుఁ! ఎంత సేపటికీ పై వాళ్ళని పొగడడమంటే మీ తర్వాతే!" అంటూ వచ్చిన కోపం అంతా గిన్నెలమీద చూపించింది కాత్యాయని. భర్తని ఆఫీసుకీ, పిల్లల్ని స్కూళ్ళకీ పంపించాక కాత్యాయనికి ఏం తోచలేదు. పైగా ఎదురింటావిడ వివరాలు తెలుసుకోవాలనే తాపత్రయం ఒకటి. దాంతో నాలుగు మెతుకులు గబగబా నోట్లో వేసుకుని, నాలు గిళ్ళవతల ఓ ఇంటి అరుగుమీద సమావేశమైన మహిళా బృందాన్ని చూసి అటు అడుగు కదిపింది కాత్యాయని, తాపీగా వక్కపొడి నములుతూ.

"రండి . ఏవిటి మీరు ఆ కటకటాల ఇంట్లోకి కొత్తగా వచ్చారా?" అంటూ అక్కడున్న ఆడవాళ్ళల్లో ఒకామె కాత్యాయనిని పలకరించింది. కాస్సేపు ఆ కబురూ ఈకబుర్లూ అయ్యాక కాత్యాయని అసలు సంగతి కదిపింది" అదేవిటండీ మా ఎదురింటావిడ ఎప్పుడూ తలుపు తీసినట్లూ, ఎవరితోటీ మాట్లాడినట్లూ ఉండదు" అని.

"అబ్బే అదేంలేదే పలకరించిన వాళ్ళతో బాగానే మాట్లాడుతుండే!" అన్నారు వాళ్ళలో ఒకామె.

"ఏమో కొంచెం గర్విష్ఠి అనుకుంటాను"

"రామ రామ! చాలా సరదా అయిన మనిషండీ!"

తను చెప్పిన ప్రతిదానికీ వాళ్లు వ్యతిరేకత తెలియ జరచడంతో కాత్యాయనికి ఇంక అక్కడ ఉండబుద్ధి కాలేదు. 'వస్తా' అని చెప్పి గబగబా ఇంటికి వచ్చేసింది. వచ్చిందేకాని ఎదురింటావిడ గురించి ఆలోచిస్తూనే ఉంది. ఈ వీధిలో వాళ్ళంతా ఈవిడ భజన సంఘంలా ఉన్నారు. వాళ్ళతో మాట్లాడ్డం వెగటనిపించింది. పోనీ అని ఇంట్లో కూచుందామంటే ఏం తోచడంలేదు. భర్తా పిల్లలూ సాయంత్రందాకా ఎలాగా రారుకదా. అప్పటిదాకా ఈసురోమని ఇంట్లో కూర్చోవడం ఎందుకని, తలుపుతాళం పెట్టి తాము వదిలేసి వచ్చిన ఇంటివేపు బయలుదేరింది. ఆ వీధిలో ఉన్న పాత స్నేహితుల్ని పలకరించివద్దామనే ఊహతో.

ఇలా రోజూ పదకొండు అయ్యేటప్పటికి తలుపు తాళం పెట్టడం - ఖాళీ చేసిన ఇంటి వీధిలోకి వెళ్ళడం కబుర్లు చెప్పడం నాలుగు గంటలకి ఇల్లు చేరుకోవడం. కాత్యాయని ఇలా వారం రోజులు కాలక్షేపం చేసింది.

ఎదురింటామె ఇంకా మనస్సులో ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. ఎందుకిలా అంచనాలు వేస్తూ కూర్చోవడం? ఓమాటు ఏదో వంకని వెళ్ళి పలకరించి అసలు సంగతి ఏదో తెలుసుకుని వస్తే పోదూ? ఇలా ఆలోచన రావడం ఏమిటి

కాత్యాయని ఇల్లు తాళంపెట్టి ఎదురింట్లోకి అడుగు పెట్టడం ఏమిటి, రెండూ దాదాపు వెంట వెంటనే జరిగి పోయాయి.

"రండి రండి ఎదురింట్లోకి మీరీమధ్య దిగారు కదూ?" అంటూ పలకరించి. చదువుతూన్న పుస్తకం పక్కనిపెట్టి కుర్చీ చూపించింది ఆమె, కాత్యాయనికి.

"మరేనండీ పది పదిహేను రోజులైంది. మీరు వచ్చి పలకరిస్తారేమో అని చూశాను. చివరకి పట్టుదల ఏమిటని ఇలా చక్కా వచ్చా."

"మంచి పని చేశారు ఇందులో పట్టుదలలేమున్నాయి? ఉండండి ఇప్పుడే వస్తాను" అంటూ ఆమె లోపలికి వెళ్ళింది చల్లారిన పాలు తోడుపెట్టి రావడానికి.

గదీ, ఇల్లూ అంతా కంగారుగా కళ్ళతో పరిశీలించేసి, "అబ్బో ఇల్లంతా అందంగా సర్దుకుందే! స్టీలు బీరువా, సోఫా, ఫేనూ, ఫ్రిజ్‌లాంటి ఆధునికమైన ఫర్నిచరు కూడా ఉందే. డబ్బున్నవాళ్ళేమిటి చెప్మా! అందుకే దర్పంగావుంది మనిషి కూడా. కోరిందల్లా కొనే మొగుడుంటే ఎన్ని దర్జాలేనా పోవచ్చు" అంటూ మూతి తిప్పుకుంది కాత్యాయని.

పాలు తోడుపెట్టి ఆమె వచ్చాక "మీ పేరు?" అని అడిగింది కాత్యాయని.

"మీనాక్షి" అని సమాధానం.

"అవునూ? మీవారు ఉద్యోగం చెయరటగా? పాపం ఏం చదువుకోలేదా?" వెటకారాన్ని సానుభూతి కోటింగ్‌లో దాచడానికి ప్రయత్నించింది. కాత్యాయని.

మీనాక్షి ఆ మాటకి తేలిగ్గా నవ్వేసి "ఎగ్రికల్చర్ బి. యస్. సీ. చదివి ఉద్యోగంకూడా చేశారు. ఈ భూసంస్కరణలవల్ల వున్న పాతిక ఎకరాల మాగాణి అన్యాక్రాంత మౌతుందని ఆలోచించి ఉద్యోగానికి శలవుపెట్టి ప్రస్తుతం స్వంత వ్యవసాయం చేస్తున్నారు" అంది.

"ఓ డిగ్రీ! పాతికెకరాల మాగాణి! అబ్బా!" కాత్యాయని ఆశ్చర్యాన్ని మనస్సులో ఎంత దాచుకోవాలని ప్రయత్నించినా, ముఖమూ కళ్ళూ ఆ ఆశ్చర్యాన్ని దాచ లేక పోయాయి. ఆమె కంగారు చూసి మీనాక్షి సన్నగా నవ్వుకుంది.

"మీ పిల్లలు ముగ్గురూ పై చదువులకి వెళ్లారని చెప్పింది మా అమ్మాయి. మిమ్మల్ని చూస్తే పాతిక ముప్పై ఏళ్ళకంటే ఎక్కువున్నట్లు కనిపించరు. మీరు మీవారికి రెండో పె..." కాత్యాయని మాటని మధ్యలోనే త్రుంచేసి "అంత మాటనకండి నాకు చిన్న వయస్సులోనే పెళ్లయింది. ఆ ముగ్గురూ నా పిల్లలే" అంది మీనాక్షి నొచ్చుకుంటూ.

"తొందరపడి రెండో పెళ్ళి అని అనేశానే!" అని ఒక్క క్షణం కాత్యాయని మనస్సులో తబ్బిబ్బు పడి, తప్పు చేసిన

దానిలా మొహం పెట్టింది. కాని వెంటనే ఆ తడబాటు సర్దుకోవడంకోసం "ఏవిటి మీ పెరడంతా చాలా బాగుందే!" అంటూ గబగబా ఇల్లూ పెరడూ కలియ తిరిగేసి వచ్చింది. వచ్చి ఆయాసంగా కుర్చీలో కూర్చుంటూ "బాగుంది వంటింటివేపు కిచన్ గార్డెనూ, బెడ్‌రూమ్‌వైపు పువ్వుల మొక్కలూ చక్కగా ఉంది" అంది కాత్యాయని. ఎంత తీరుగా వుంది ఇల్లు! తన ఇల్లు ఈ జన్మలో ఇలా అవుతుందా! ఆ ముష్టి మూడు వందలు జీతం. ఆఫీసు కాగితాలు సర్దుకోవడం తప్ప ఇతర సరదాలేం లేని మనిషి! హుఁ!" అనుకొంది కాత్యాయని.

ఇల్లంతా ఇన్‌స్పెక్టరులా చెక్‌చేసివచ్చి ఉస్సురంటూ కూచుంటూన్న కాత్యాయనిని చూసి నవ్వుకుని "శ్రమపడినట్లున్నారు. కొద్దిగా మజ్జిగ ఇమ్మంటారా శ్రమ తీరుతుంది" అంది మీనాక్షి.

కాత్యాయని ఈసడింపుగా "మజ్జిగా!.... వద్దండీ.... నాకు కాఫీ టైమయింది వస్తా" అంటూ వచ్చేసింది.

వచ్చినప్పటి నుంచీ కాత్యాయని మనస్సు చిరాకుగానే వుంది. మీనాక్షి ఇంట్లో కనిపించిన ప్రశాంత సుందర వాతావరణం; ఆమె ముఖంలో ద్యోతక మవుతూన్న తృప్తి ఆనందం, కాత్యాయని మనస్సులో ఇదీ అని చెప్పలేని అశాంతినీ బాధనీ కలిగించాయి. మీనాక్షి పొందుతూన్న హాయినీ, ఆనందాన్ని తనెందుకు పొందలేక పోతోంది!

ఇలా కాత్యాయని అస్థిమితంగా ఇబ్బంది పడుతూన్న సమయంలో రామనాథం వచ్చి "ఇంకో గంటలో మా ఫ్రెండ్స్ కాఫీకి వస్తారు. ఇల్లంతా ఇలా గలీజుగా కాకుండా కొంచెం నీట్‌గా సర్దు" అన్నాడు.

దాంతో తన చికాకు అంతా కాత్యాయని అతని మీదకి మళ్ళించింది. "ఇప్పుడు వాళ్ళెందుకు కాఫీకి? ఇల్లంతా నీట్‌గా సర్దడానికి వాళ్ళేం వియ్యాలవారా, పై ఆఫీసర్లా? అయినా ఇదేమైనా స్వంత ఇల్లే మిటి అందంగా అలంకరించ డానికి?" అంది.

రామనాథం ఆమెకి నచ్చ చెప్పబోయాడు. కాత్యాయని వినిపించుకోకుండా ఇంకా ఏదో చదవబోయింది. రామ నాథానికి చిర్రెత్తుకొచ్చి గట్టిగా అరిచాడు. ఇలా కాత్యాయనీ రామనాథం ఒకళ్ళ నొకళ్ళు కేకలేసుకుంటూన్న సమయంలో, ఎదురింటిలోంచి మామూలుగా నవ్వులు వినిపించాయి. వెంటనే కాత్యాయని "సర్లెండి. అలాగే సర్దుతాను. అరవ కండి" అంటూ రామనాథంతో రాజీకి వచ్చేసింది రామ నాథం ఆశ్చర్యపోయాడు. ఆ నవ్వులు తన భార్యలో ఎంత హఠాత్తుగా మార్పుని తీసుకు వస్తున్నాయి! ఎదురింటి దంపతులు వాళ్ళల్లో వాళ్ళు నవ్వుకుంటున్నవే! అవి తమని చూసి నవ్వినవేం కావు. ప్రశాంతంగా మధురంగా ఉండడమే అందుకు సాక్ష్యం. అయినా తన ఇంట్లో ఉరుములూ మెరు పులూ తగ్గి వాతావరణం చల్లబడడానికి ఎంతో ఉపక రిస్తున్నాయి.

మర్నాడు మధ్యాహ్నం భర్తనీ పిల్లల్నీ పంపించాక, రెండు మెతుకులు నోట్లో వేసుకుని, ఇల్లు తాళంపెట్టి ఎదురింటి మీనాక్షి దగ్గరికి బయలుదేరింది కాత్యాయని. మీనాక్షి 'రండి' అంటూ చిరునవ్వుతో పలకరించి "కూర్చోండి ఇదిగో, ఈ స్వెట్టర్ మెడకాస్తా అల్లేసి షాపుకి అర్జంటుగా పంపెయ్యాలి. అందాకా మీరా పేపరు చూస్తూండండి" అంది.

"అరే- స్వెట్టర్లు అల్లి బజార్లో ఇస్తారా? ఇదొక బిజినెస్ అన్నమాట!" అంది కాత్యాయని ఆశ్చర్యంగా దవడలు నొక్కుకుంటూ

"ఇదొక కళ అని ఎందుకు అనుకో కూడదూ?" అంది మీనాక్షి.

"ఏమైనా చూస్తున్నాను కదూ? ఈ తెలివి అంతా మీ ఆయన నేర్పి ఉంటారు. తెలివైన భర్త దొరికితే...."

"ఇదిగో ఇలా చూడండి. మీరేం అనుకోకపోతే కొన్ని విషయాలు మీకు చెబుదాం అనుకుంటున్నాను. ఎదుటి మనిషి ఏం బాధపడుతుందో అని ఆలోచించకుండా నోటికి ఏం వస్తే అది పదపద అనెయ్యడం....ఏమిటి నా కర్థంకాదు. అలా తొందరగా మాటలు విసిరెయ్యడంవల్ల మీ చుట్టూ కావాలని విరోధుల్ని తయారు చేసుకుంటున్నారన్నమాట. మొన్న

టికి మొన్న అవతల ఇంటి అరుగుమీద వాళ్ళ దగ్గర నాకు గర్వం అని అనేసి వచ్చారట. ఇప్పుడు? నా భర్త.... సరే....తెలివైన వాడే! అంతలో నేను తెలివి తక్కువదాన్ని అయి ఉండాలా తప్పకుండా? ఇద్దరూ తెలివైన వాళ్ళు కాకూడదా? అయినా మీకేమిటి అభ్యంతరం మేమిద్దరం తెలివైన వాళ్ళమయితే?"

కాత్యాయని మొఖంలో కత్తి వేటుకి నెత్తురు చుక్క లేదు. ఇలా తన నెవ్వరూ మొహంమీద అనెయ్యలేదు. ఇటువంటి సమస్యని తను ఇంతవరకూ ఎదుర్కోలేదు. ఎంత సేపటికీ ఎవరినేనా అనడమే కాని తను పడడం ఎరుగదు కాత్యాయని. ఎదురింటి గొడవల్లో ఎరక్కపోయి తల దూర్చానుకదా అని మొదటిసారిగా బాధపడింది.

"మీరు మాటల్ని ఇంత కటువుగా అంటూంటే రేపొద్దున్న మీ పిల్లలికి, సౌమ్యంగా మాట్లాడ్డం ఎలా వస్తుంది చెప్పండి. వెనకటికి ఒకావిడ మాటకి ముందు మొగుడ్ని "మీ మొహం" అనేది. ఆ తర్వాత ఆవిడ పిల్లలు ఇద్దర్నీ కలిపి "మీ మొహాలు నోరు ముయ్యండి" అనడం నేర్చుకున్నారు. అందువల్ల సౌమ్యంగా మాట్లాడ్డం నేర్చుకోండి. మీ చెల్లెలులాంటిదాన్ని. ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకోండి. ముఖంమీద నేను కనుక చెప్తున్నాను. మరొక రైతే వెనకాల పెదవి విరిచి ఆక్షేపణచేసి ఉందురు.

కాత్యాయని కొరకొరా చూసింది.

"అయినా అస్తమానం ఇంటికి తాళం పెట్టి పెత్తనా లకి బయలు దేరితే ఎలా? రేపొద్దున మిమ్మల్ని చూసి మీ పిల్లలు నేర్చు కోరూ? పైగా రోజూ ఇలా బయలు దేరితే ఇంట్లో పనెప్పుడు చేసుకుంటారు? ఇల్లు అన్నాక లక్ష పనులుంటాయి. ఏవో చిన్న చిన్న పనులు చేసుకుంటూ లక్షణంగా ఇల్లు సర్దుకుంటూ కాలక్షేపం చేస్తే ఎంత బాగుం టుందో ఆలోచించండి. కారణం లేందే మనం తరచు బైటికి వెళుతుంటే, విలువపోయి అలుసై పోతాం. అంతగా తోచక పోతే ఏవైనా పుస్తకాలు చదువుకోండి. కాలక్షేపానికి కాల క్షేపమూ అవుతుంది. సంస్కారానికి సంస్కారమూ పెరుగు తుంది" ఇలా మాట్లాడుతూనే మీనాక్షి స్వెట్టరు అల్లడం పూర్తిచేసి పక్కని పెట్టింది.

నిర్మొహ మాటంగా మొహంమీద ఇలా మీనా అనేస్తుంటే కాత్యాయని చాలా ఇబ్బంది పడింది. ఒక్క ఉదుటున వెళ్ళి ఇంట్లో పడదాం అనిపించింది కాని పౌరుషం అడ్డు వచ్చి అమట్టునే కూర్చుని మీనాక్షి చెప్పిందంతా విని, వ్యంగ్యంగా "ఇంత విజ్ఞానాన్ని మీకు ప్రసాదించిన ఆ పుస్తకాలేవిటో సెలవిస్తారా?" అంది. మీనాక్షికి కోపమూ నవ్వు కూడా వచ్చాయి.

"ఇలా అంటున్నానని మీకు కోపం వచ్చింది. అవునా? ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకోండి. ఉద్యోగాలు చేసి భర్తకి సాయపడక పోయినా ఫరవాలేదు. కాని వ్యర్థంగా

కాలక్షేపం చేస్తూ, కఠినంగానూ నిర్లక్ష్యంగానూ మాట్లాడుతూంటే, ఆ భర్తపడే క్షోభ ఇంతా అంతాకాదు. నేనిదంతా చెప్తున్నానంటే, మీ కంటే తెలివైన దాన్ననీ, నా తెలివి అంతా మీ దగ్గర ప్రదర్శిద్దామనీ కాదు. మీ మంచి కోరి, మీ కొక స్నేహితురాలిగా. మీదు మిక్కిలి ఒక చెల్లెలిగా నా అభిప్రాయాలు చెప్పాను. మీ మనస్సుని కష్టపడితే క్షమించండి."

మీనాక్షి అలా సౌమ్యంగా అంటూంటే కాత్యాయని కళవళ పడింది. మీనాక్షిమాటల్లో ఎంతవరకు నిజం ఉంది. అని ఆలోచించ సాగింది. ఆమె చెప్పినవన్నీ నిజమేనేమో! కాత్యాయని మనస్సు ఆందోళనగానూ, అస్థిమితంగానూ మారిపోయింది. "వస్తా" అని చెప్పి ఇంటికి వచ్చి మంచం మీద పడుకుని ఇప్పటిదాకా తను ఎలా ఉంటూ వచ్చిందీ. మీనాక్షి చెప్పిన ప్రకారం ఉంటే ఎలాఉండేదీ ఆలోచించింది. సాయంత్రం దాకా కాత్యాయని ఆలోచిస్తూనే ఉంది.

సాయంత్రం రామనాధం ఇంటికి వస్తూనే ఆశ్చర్య పోయాడు. ఇల్లంతా ఏంతో అందంగా సర్ది ఉంది. కాత్యాయని చక్కగా ముస్తాబై నవ్వుతూ రామనాధాన్ని పలకరించి అతనిచేతిలో ఫైల్సు అందుకొంది. విప్పుతూన్న షర్టు అందుకొని హేంగర్ కి తగిలించింది. పెరట్లోకి వెనకాతే వెళ్ళి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళూ, తుడుచుకోడానికి టవలూ అందించింది. ఎప్పుడూలేని ఈ ఆదరణచూసి ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు రామనాధం.

"శ్రమపడి వచ్చారు. కాఫీ తర్వాత ఇస్తాను. ముందీ మజ్జిగ తీసుకోండి" అంది కాత్యాయని. అతను కుర్చీలో కూర్చుంటే. పక్కని స్టూలుమీదకూర్చుని అతనికి విసురుతూ "రేపు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు నాకేమైనా రెండు మంచి పుస్తకాలు తెచ్చి పెట్టండీ!.... ఆ చేత్తోటే రెండు విచ్చేలు ఊలు తీసుకొస్తే స్వెట్టరు అల్లడం నేర్చుకుని స్వెట్టర్లు అల్లుతూ ఉంటాను. అవి బజార్లోకొస్తే నెలకి నలభై ఏభై రూపాయలు కనిపిస్తుంది....ఏమండీ....రేపు తప్పకుండా పుస్తకాలూ ఊలూ తెచ్చి పెడతారు కదూ?" గోముగా అడిగింది కాత్యాయని.

భార్య ఇలా సౌమ్యంగా మారిపోయిందేమిటని ఆశ్చర్యపోతూ "ఏమిటీ మార్పంతా?" అంటూ ఆమె బుగ్గ పుణికాడు రామనాధం.

కాత్యాయని పులకించిపోతూ "ఏమిటా అల్లరి పిల్లలు వచ్చే వేళయింది" అంది.

"ఆహా! వాళ్ళు చూస్తారని భయం లేకపోతే అభ్యంతరం లేదన్నమాట! అవునా?" అన్నాడు.

కాత్యాయని నవ్వింది. రామనాధమూ నవ్వాడు. వాళ్ళనవ్వులు అచ్చు ఎదురింటి దంపతుల నవ్వుల్లా స్వచ్ఛంగా హాయిగా ఉన్నాయి. భర్త నుదుటి మీద పడుతూన్న ముంగురులు సవరిస్తూ "ఊ.... ఇ ల్లు" అంది కాత్యాయని.

"ఏవిటీ? ఇల్లు మారాలా మళ్ళీ?" అన్నాడు రామనాథం.

"అబ్బ....మీకంతా తొందర....నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. ఈ ఇల్లు అసలు మారొద్దు." అంది కాత్యాయని.

"హమ్మయ్య"అని తృప్తిగా నిట్టూర్చాడు రామనాథం.

(మహిళ)